ఒక్క ఊరికే ఇందిరమ్మ



కొత్తపల్లిలో మీసాల రవి కుటుంబం ఉంటున్న చిన్న గుడిసె

- 'ఇందిరమ్మ ఇళ్ల' పైలట్ ప్రాజెక్టులో ఎంపికైన దాంపూర్
- ఇదేంటని ప్రశ్నిస్తున్న ఇతర గ్రామాల ప్రజలు

భీమారం: అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకువచ్చింది. ఏడాది క్రితం ప్రజాపాలన కింద దరఖాస్తులు స్వీకరించగా, క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి లబ్ధిదారులను గుర్తించారు. అయితే భీమారం మండల వ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టులో దాంపూర్ ఎంపికైంది. దాంపూర్‌లో 88 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. మొదటగా ఆ గ్రామంలో నిర్మాణాలు చేపట్టనున్నారు. గృహ నిర్మాణసంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్సీలాల్ గత నాలుగు రోజుల క్రితం వచ్చి ముగ్గు పోశారు. ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇళ్లు నిర్మించే విధానంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కాగా, పైలట్ ప్రాజెక్టుగా దాంపూర్‌ను పరిమితం చేయడంపై మిగతా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తున్నారు.

దాంపూర్‌కే పరిమితమా?

భీమారం మండలంలోని 11 పంచాయతీల నుంచి 3,986 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సొంత భూమి ఉన్న 1,449 మందిని అర్హులుగా గుర్తించారు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉత్కంఠ నెలకొంది. అయితే పైలట్ ప్రాజెక్ట్‌లో దాంపూర్ ఎంపికైంది. ఇందిరమ్మ ఇళ్లు దాంపూర్‌కే పరిమితం చేయడంపై మిగితా గ్రామాల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అన్ని గ్రామాల పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని చెప్పి ఇప్పుడు మాటమార్చడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ముందే పైలట్ ప్రాజెక్ట్ ఒకటి ఉంటుందని చెబితే అంతగా ఆశపడేవారం కాదని అంటున్నారు. ఇళ్ల మంజూరుపై షరతులు పెట్టని ప్రభుత్వం ఇప్పుడు ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు వందల సంఖ్యలో ఉన్నాయి.

భూమి ఉన్న వారికే ఎంపిక..

సొంత భూములు ఉన్న వారిని ఎంపిక చేయడం అన్యాయమని పలువురు నిరుపేదలు పేర్కొంటున్నారు. చాలా గ్రామాల్లో పేదలు సొంతింటి కల నెరవేరతుందని ఎంతో ఆశ పడ్డారు. ప్రభుత్వం విధించిన అంక్షలతో ఆశలు ఆడియాసలయ్యాయి. సొంత భూములు లేని కుటుంబాలు అనేకం ఉన్నాయి. వారందరికి ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించాలని వారు కోరుతున్నారు.

ఎదురుచూస్తున్నాం



ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూస్తున్నాం. ఇద్దరు పిల్లలతో గుడిసెలో ఉంటున్నాం. ప్రభుత్వం వెంటనే ఇల్లు మంజూరు చేయాలి. అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టాలి. ఎస్సీలతోపాటు పేద కుటుంబాలను మొదట ప్రాధాన్యత ఇవ్వాలి.

– మీసాల రవి–రమాదేవి దంపతులు, కొత్తపల్లి

ప్రభుత్వ ఆదేశాలు అందగానే..



పైలట్ ప్రాజెక్ట్‌లో ఎంపికైన దాంపూర్‌లో మొదటగా ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తాం. మిగతా గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేశాం. ప్రభుత్వ ఆదేశాలు అందగానే నిర్మాణాలు చేపడుతాం.

– మధుసూదన్, ఎంపీడీవో, భీమారం

వాహన తనిఖీల్లో నిర్లక్ష్యం చేయొద్దు

- మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ ప్రకాశ్

దండేపల్లి: మంచిర్యాల–జగిత్యాల సరిహద్దులోని దండేపల్లి మండలం గూడెం వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ శనివారం తనిఖీ చేశారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. భారీ వాహనాల తనిఖీల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అక్రమంగా తరలించే వాటిని అడ్డుకొని, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి అప్పగించి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఆయన వెంట దండేపల్లి ఎస్సై తహసీనొద్దీన్ ఉన్నారు.

బేహరూన్‌గూడ గ్రామ సందర్శన..

దండేపల్లి మండలం బేహరూన్‌గూడ గిరిజన గ్రామాన్ని దండేపల్లి ఎస్సై తహసీనొద్దీన్ శనివారం సందర్శించారు. గిరిజనులతో మాట్లాడారు. మత్తు పదార్థాల తరలింపు, వాడకం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

ప్రమాదాల నివారణకు సూచికబోర్డులు ఏర్పాటు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ వేణుచందర్ తెలిపారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ ఏరియా బస్టాండ్ నుంచి జీఎం కార్యాలయం వరకు ప్రమాదాలకు ఆస్కారం ఉన్న రోడ్లపై సూచికబోర్డులు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ సీటు బెల్టు, హెల్మెట్ ధరించి వాహనాలు నడుపాలని, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర రావు

బెల్లంపల్లిరూరల్: వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వెంకటేశ్వరరావు అన్నారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామ పంచాయతీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా సిబ్బంది తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తను సేకరించి వేర్వేరుగా డంపింగ్ చేసి సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి సారించాలని తెలిపారు. ఇంటి పన్ను వసూలు వందశాతం చేపట్టి గ్రామ పంచాయతీ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. పంచాయతీ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ గ్రామీణులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పన్ను చెల్లించలేదని తాళాలు



ఇంటికి తాళం వేస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధి లో ఆస్తి పన్ను చెల్లించని భవనాలు, ఇళ్లు, దుకాణాలకు అధికారులు, సిబ్బంది తాళాలు వేసి, సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని చున్నంబట్టి వంద ఫీట్ల రోడ్డులో గత ఐదేళ్లుగా ఇంటి పన్ను చెల్లించకపోవడంతో పాటు, మున్సిపల్ అధికారులపై ఆ ఇంటి యజమాని బెదిరింపులకు పాల్పడడంతో పాటు, ఇష్టారీతిన తిట్టడంతో ఆ ఇంటిని సీజ్ చేశారు. దీంతో దిగొచ్చిన ఆ ఇంటి యజమాని గంటలోపు రూ.31వేల పన్ను చెల్లించారు. బైపాస్ రోడ్డులోని వెల్డింగ్ దుకాణానికి సంబంధించిన రూ.24వేల పన్ను బకాయి ఉన్నందుకు తాళాలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణ అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తెలిపారు. మందమర్రి మండల కేంద్రంలోని కస్తూరిబా స్కూల్ వెనుక (ప్రాణహిత కాలనీ)లో రూ.20లక్షల వ్యయంతో నిర్మించే ఆయుష్మాన్ భవన్ నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, ఎంపీడీవో రాజేశ్వర్, మెడికల్ ఆఫీసర్ రమేశ్, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ సురేష్, ఏఈ ఇసాక్, ఎంపీవో సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మృతి



కొమురయ్య(ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బోయిని కొమురయ్య (72) శనివారం మృతి చెందారు. సింగరేణిలో కార్మికుడిగా పనిచేసి రిటైర్డు అయిన తర్వాత కొన్ని నెలల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మంచిర్యాలలో నివాసం ఉంటున్న కొమురయ్య ఉదయం తనఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. 1995లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి కౌన్సిలర్‌గా గెలిచి, అనూహ్య పరిణామాలతో వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న కొమురయ్య మృతిపై పలువురు సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.


సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్న ఫెస్ట్ 2.0లో వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి సులేమాన్ ప్రారంభించారు. ఈ నెల 24 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో 300మంది వైద్య విద్యార్థులు వారి ప్రతిభను చాటుతూ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

'పరిష్కారం కాకుంటే పంపండి'



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

మంచిర్యాలటౌన్: భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రతి మండలంలో మండల్ లెవల్ కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, రెండు వారాల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్నింటిని పరిష్కరించారని, పరిష్కారం కాని సమస్యలు ఉంటే డివిజన్ కమిటీకి పంపాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో శనివారం డివిజనల్ లెవల్ కమిటీ ఆధ్వర్యంలో భూసంబంధిత సమస్యల పరిష్కారం కోసం మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి సమావేశాన్ని నిర్వహించగా, 11మండలాలకు చెందిన తహసీల్దార్లు పాల్గొన్నారు. మండల్ లెవల్‌లో పరిష్కారం అయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఇరువురి ఘర్షణతో ప్రభుత్వపరమైన భూమి



ఇరువర్గాలకు నచ్చజెబుతున్న అధికారులు

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్‌లో మూడెకరాల వివాదస్పద భూమిని రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ అధికారుల మండల టీమ్ ఘటన స్థలికి వెళ్లి విచారణ చేశారు. అచ్చులాపూర్ శివారు సర్వే నంబర్ 1295లో ఉన్న మూడు ఎకరాల భూమి గతంలో కౌట్టి మల్లమ్మకు అసైన్డ్ చేసి పట్టా ఇచ్చారు. ఆ భూమి తమదని ఇటీవల రత్నం తార, మల్లమ్మ ఇరువురు పరస్పరం ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకున్నారు. మోఖాకోసం ఇరువురు ఘర్షణ పడటంతో శాంతిభద్రతల సమస్య ఏర్పడింది. విచారణ చేసిన అధికారులు వివాదస్పదంగా మారిన ఆ భూమిని ప్రభుత్వ పరం చేసి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఆ భూమి దగ్గరికి ఎవరూ వెళ్లవద్దని ఇరువురికి నచ్చజెప్పారు. ఈ మేరకు బెల్లంపల్లి ఆర్డీవోకు నివేధిక పంపించినట్లు తహసీల్దార్ ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో స్థల పరిశీలన

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన బాణయ్య ఈ నెల 19న ప్రజా ఫిర్యాదు విభాగంలో భూ సమస్య కోసం దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్ దిలీప్‌కుమార్ శనివారం స్థల పరిశీలనకు వెళ్లారు. బాధితుడి కథనం ప్రకారం ..తను కొనుగోలు చేసిన భూమిలో సిమెంట్, ఇటుకలు, రేకుల సామగ్రి తెచ్చుకొని నిర్మించుకుంటే, అదే గ్రామానికి చెందిన భైరయ్య, తన కుటుంబ సభ్యులు వచ్చి ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు. దరఖాస్తును పరిశీలించిన తహసీల్దార్ వారికి నోటీసులు జారీ చేసి, ఇరువురి సమక్షంలో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించగా భైరయ్యకు పాస్‌బుక్ ఉన్నందునా కేసు కోర్టులో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

నేడు ఐఎన్‌టీయూసీ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఐఎన్టీయూసీ యూనియన్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు తెలిపారు. ఇందారం 1ఏ గనిపై శనివారం ఆయన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికుల నుద్దేశించి మాట్లాడారు. నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద జరిగే ఈ సమావేశానికి యూనియన్ సెక్రటరీ జనరల్ కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ముఖ్య అతిథిగా రానున్నట్లు తెలిపారు. కార్మికులు, యూనియన్ శ్రేణులు ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా కోరారు. సమావేశంలో యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు గరిగే స్వామి, ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, నాయకులు శ్రీనివాస్, రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

'ఇన్సెంటివ్ చెల్లింపుల్లో నష్టం'

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తిలో భాగంగా కంపెనీ ప్రకటించిన స్పెషల్ ఇన్సెంటివ్ చెల్లింపుల్లో కార్మికులకు ఆర్థికంగా నష్టం చేశారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదాలు శనివారం ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. న్యూటెక్ వార్షిక ఉత్పత్తి లక్ష్యసాధనలో భాగంగా గత నెలే ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిందని, దీనికిగాను కార్మికులకు స్పెషల్ ఇన్సెంటివ్ కింద ప్రతి ఒక్కరికి రూ.2200 ఇస్తారని భావిస్తే కేవలం రూ.1200 మాత్రమే చెల్లించారన్నారు. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిచేసిన కూడా దాన్ని రవాణా చేయకుండా తక్కువ జరిగిందని చెబుతూ ఇన్సెంటీవ్‌లో నష్టం చేశారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికులకు ఇస్తున్న గ్లౌజ్‌లు, ఇతర వర్కింగ్ మెటీరియల్ నాసీ రకంగా వస్తున్నాయన్నారు. నాణ్యమైనవి అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా సెక్రెటరీ ప్రసాద్‌రెడ్డి, ట్రేడ్స్‌మెన్ ఇన్‌చార్జి సురేశ్, ఫిట్ సెక్రెటరీ ఆకుల లక్ష్మణ్, అసిస్టెంట్ సెక్రెటరీ సందీప్, నాయకులు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

బొగ్గు రవాణా పెంచాలి



అధికారులతో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: బొగ్గు రవాణాను మరింత పెంచాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన ఏరియా ఉన్నత అధికారులతో మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ గనులలో ఉత్పత్తి అయిన బొగ్గును ఏమాత్రం జాప్యం చేయకుండా వినియోగదారులకు రవాణా చేయాలన్నారు. దీంతో పాటు స్టౌవింగ్ మెటీరియల్ నిల్వలను పెంచుకోవాలన్నారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా మెటీరియల్ సరిపడినంత సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం రాజేందర్, ఏజెంట్ వెంకటేశ్వర్లు, ఏరియా సర్వే అధికారి నర్సింగరావు, పర్చేస్ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- వరి,మొక్కజొన్న పంటలకు నష్టం
- రాలిన మామిడి కాయలు



కొండపల్లిలో నేలకొరిగిన వరి



నర్సింగాపూర్‌లో నేలవాలిన మొక్కజొన్న

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు దాదాపు ఐదు గంటలపాటు ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వడగండ్లు పడ్డాయి. నర్సింగాపూర్‌లో లగిశెట్టి రవి ఇంటిపై కప్పు ఎగిరిపోయింది. వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. సబ్బేపల్లి, ధర్మారం, బుగ్గగట్టు, కొండపల్లి, గుడిపేట, నర్సింగాపూర్, రాపల్లి గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలురాలాయి. దాదాపు 80ఎకరాల్లో వరి, సుమారు 50ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. వ్యవసాయాధికారి కృష్ణ, ఏఈవోలు పంటనష్టం అంచనా వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని రైతులకు సూచించారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కోట రాజేష్‌కు చెందిన ఇంటి గోడ పూర్తిగా కూలింది. సంఘటన స్థలంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మైదం రమేష్, గోలేటి స్వామి శనివారం బాధితులను పరామర్శించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



ఆర్కేపీలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కాసిపేట 1గనిపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రామకృష్ణాపూర్: ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి సీహెచ్‌పీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించినందుకు గాను సీఎంతో పాటు మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహంకాళి శ్రీనివాస్, వేణు, ఆల్ఫ్రెడ్ జయరాజ్, గోపతి శ్రీనివాస్, తిరుపతి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు, ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు కృతజ్ఞతగా మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రుల చిత్రపటాలకు ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ సంఘం చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ కార్యదర్శి పానుగంటి వెంకటస్వామి, ప్రచార కార్యదర్శులు శంకర్‌రావు, బన్న లక్ష్మణ్‌దాస్, ఫిట్ సెక్రెటరీ రవీందర్, నాయకులు రాజన్న, సోగాల కన్నయ్య, పిట్టల శివకుమార్, శ్రీకాంత్, దినేష్, సంపత్ తదితరులున్నారు.

జమిలి ఎన్నికలతోనే దేశాభివృద్ధి సాధ్యం

చెన్నూర్: జమిలి ఎన్నికలతోనే దేశంపై ఆర్థిక భారం తగ్గుతుందని, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. శనివారం చెన్నూర్ పట్టణ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1980లో అప్పటి ఎన్నికల సంఘం జమిలి ఎన్నికలు నిర్వహించాలని సూచించినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

జైపూర్/వేమనపల్లి: పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం జైపూర్‌లో ఏసీపీ వెంకటేశ్వర్, తహసీల్దార్ వనజారెడ్డి, వేమనపల్లిలో తహసీల్దార్ రమేశ్ తనిఖీ చేశారు.

పొనకల్ వారసంత రూ.8.05లక్షలు

జన్నారం: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీలో ప్రతి మంగళవారం జరిగే వారసంత సంవత్సరానికి గాను రూ.8లక్షల 5వేలకు పొనకల్‌కు చెందిన బీనవేని గంగన్న కై వసం చేసుకున్నారు. గంగన్నను ఎంపీడీవో ఉమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, పంచాయతీ ఈవో రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్ సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

అభివృద్ధి పనుల పరిశీలన

వేమనపల్లి/కోటపల్లి: మండలాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కోటపల్లి ఎంపీడీవో లక్ష్మయ్య, వేమనపల్లి ఎంపీడీవో కుమారస్వామి అన్నారు. వేమనపల్లి మండలంలోని కళ్లెంపల్లి, సుంపుటం గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న ప్రహరీ, ట్యాంకిల్ షెడ్ పనులను కుమారస్వామి పరిశీలించగా, కోటపల్లి మండలంలోని కొల్లూర్, పార్‌పల్లి, పిన్నారం, ఎడగట్ట, ఎసన్‌వాయి గ్రామాల్లో జరుగుతున్న పనులను లక్ష్మయ్య పరిశీలించారు.

నర్సరీ సందర్శన

భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని శనివారం ఎంపీడీవో మధుసూదన్ సందర్శించారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని వన నర్సరీల్లోని మొక్కలకు ఎక్కువ మొత్తంలో నీటిని అందించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు.

పోషకాహారంపై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి శనివారం పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

నెన్నెల: నీటి వసతి ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పాం తోటలు సాగు చేస్తే రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చని ఏఈవో రాంచందర్ అన్నారు. మన్నెగూడంలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు.

భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

మంచిర్యాలఅర్బన్: భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా శనివారం శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుత్‌షాక్‌తో మేక మృతి

లక్సెట్టిపేట: మండలంలోని అంకతిపల్లి గ్రామం పెరిక శ్రీకాంత్‌కు చెందిన మేక విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. మేక విలువ సుమారు రూ.పదిహేను వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

వీవోఏలకు కనీస వేతనం నిర్ణయించాలి

పాతమంచిర్యాల: బడ్జెట్ సమావేశాల్లో వీవోఏలకు కనీస వేతనం నిర్ణయించాలని ఐకేపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టుభవన్‌లో శనివారం ఐకేపీ వీవోఏల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



దండేపల్లి: అధికారంలో ఉన్నా, లేకున్నా కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ తెలిపారు. దండేపల్లి పద్మశాలీ భవన్ వద్ద శనివారం కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ద్వారా మండలంలోని ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు.

ముందస్తు అరెస్టు

కోటపల్లి/చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి బడ్జెట్‌లో అన్యాయం చేసిందని ఆరోపిస్తూ శనివారం అసెంబ్లీ ముట్టడికి బీఆర్ఎస్‌వీ ఇచ్చిన పిలుపులో భాగంగా చెన్నూర్, కోటపల్లి మండలాల బీఆర్ఎస్‌వీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.